సాక్షి
కుమురం భీం

గురువారం ၊ 21 ၊ ఆగస్టు ၊ 2025



తాళాలు తెరవక..

ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు వైద్య ఆరోగ్య శాఖకు భవనాలు అప్పగించలేదు. 9లో▸



'ఉల్లాస్'తో వయోజనులకు విద్య

ఉల్లాస్ కార్యక్రమంపై ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వయోజన విద్య గురించి వివరించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.7 /26.9

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఈ నెల 22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయని, మరిన్ని వివరాలకు 80080 90626 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో యువతీ యువకులకు తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా పరిసర ప్రాంత సింగరేణి సేవా సమితి సభ్యులు, స్వశక్తి సంఘాల మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. తేనెటీగల పెంపకంపై శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 సాయంత్రం 5గంటల లోగా గోలేటిలోని జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంట్‌లో లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 99512 14116 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

23న రాష్ట్రస్థాయి ధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 23న రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్లు యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు చరణ్‌దాస్, వైద్య శాంతికుమారి పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలన్నారు. ప్రతీ రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈవో, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాడికేశవ్, రాజ్‌కమలాకర్, మహిపాల్, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రంలోని అంశాలపై ఖాన్ అకాడమీ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఖాన్ అకాడమీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తిచేసి, విద్యార్థులకు వీడియోల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం కృత్యాలు సాధన చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు భరత్‌రావు, సమ్మయ్య, అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష!

చింతలమానెపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు వివాదాలకు దూరంగా ఉంటాడు. అందరితో కలివిడిగా ఉండే అతను లక్షల రూపాయలు అప్పుల పాలయ్యాడు. ఇల్లు, భూములు అమ్ముకుని చెల్లించినా పూర్తిస్థాయిలో తీరలేదు. సాధారణ జీవితం గడిపే అతడు ఎలా అప్పుల పాలయ్యాడనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిసింది.

బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లికి చెందిన ఆత్రం సాయి ఆన్‌లైన్‌లో రూ.28వేలు మోసపోయినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హర్ష సాయి అనే యూట్యూబర్ పేరుతో హర్యానాలోని మేవాట్ ప్రాంతానికి చెందిన తౌఫిక్ మోసాలకు పాల్పడుతున్నట్లుగా సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. అనుచరులతో కలిసి నకిలీ నంబర్లు, వాట్సాప్ ద్వారా ప్రలోభాలు గురిచేసి ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.



బెజ్జూర్ మండల కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సర్తాజ్(ఫైల్)

- పెరుగుతున్న సైబర్ మోసాలు
- అప్పులపాలవుతున్న యువకులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసుశాఖ
- తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచన

చింతలమానెపల్లి(సిర్పూర్): రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సైబర్ నేరగాళ్లు వినియోగించుకుంటున్నారు. కొత్తపోకడలు అనుసరిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు పెరిగాయి. బాధితులకు న్యాయం చేయడంతోపాటు మోసాల బారిన పడకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 2024లో 401 సైబర్ క్రైం ఫిర్యాదులు రాగా వీటిలో 31 ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2025లో ఇప్పటివరకు 195 ఫిర్యాదులు రాగా 15 ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు సైబర్ క్రైం పోలీసులు వెల్లడించారు.

పలు రకాలుగా మోసం

'బ్యాంకుల్లో నగదు తమకు తెలియకుండానే మాయమవుతుంది... బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్‌పే ద్వారా నగదు తీసుకున్నారు.. ఖాతాల్లోని నగదు వినియోగించుకోలేక పోతున్నాం..' అంటూ ఇటీవల తరచూ పోలీస్‌స్టేషన్లకు, బ్యాంకులకు ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి నగదు కోల్పోతున్న వారి సంఖ్య కూడా వందల సంఖ్యలో ఉంటోంది. చిన్నారులు సైతం లక్షలాది రూపాయలను ఆన్‌లైన్‌లో కోల్పోతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్, షాపింగ్ ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. ఇటీవల కస్టమ్స్ అధికారులమని, నగ్న వీడియో కాల్స్‌తో బెదిరింపులు సైతం కేసులు నమోదవుతున్నాయి. సోషల్ మీడియాను నేరగాళ్లు మోసాలకు అనువుగా మార్చుకుంటున్నారు. అమాయకులను బుట్టలో వేసుకోవడానికి ఈ సమాచార వేదికల ద్వారా నెట్‌వర్క్ పెంచుకుంటున్నారు. నిమిషాల్లో రూ.లక్షల ఆదాయం, కార్లు, విలువైన బహుమతుల పేర్లతో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ మోసం చేస్తున్నారు. రకరకాల కరెన్సీల పేరుతో పెట్టుబడి పెట్టించి రెట్టింపు లాభాలు ఆశ చూపి బుట్టలో వేస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో గుర్తు తెలియని లింక్‌లు తెరిచినా వ్యక్తిగత సమాచారం, ఇతర వివరాలను తస్కరణకు గురయ్యే అవకాశం ఉంది.

'జన్నారం' ఘటనతో అలర్ట్

మంచిర్యాల జిల్లా జన్నారంలో సిమ్‌కార్డుల ద్వారా సైబర్ మోసాలకు పాల్పడుతున్న నెట్‌వర్క్ పోలీసులు ఛేదించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులతోపాటు స్థానికులను అదుపులోకి తీసుకున్నారు. మారుమూల ప్రాంతాలను సైబర్ నేరగాళ్లు అడ్డాలుగా మార్చుకుంటుండటంతో జిల్లా పోలీసు అలర్ట్ అయ్యారు. సైబర్ క్రైం నియంత్రణలో భాగంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కళాజాత బృందాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎస్పీ కాంతిలాల్, ఏఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు సైతం వేదికలపై డిజిటల్ మోసాల గురించి ప్రస్తావిస్తున్నారు. యువత అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు వివరించాలని సూచిస్తున్నారు. స్టేషన్లలో సీఐ, ఎస్సై, సిబ్బందితో టీంను ఏర్పాటు చేసి కేసులను విచారిస్తున్నారు. సైబర్ క్రైం కేసుల్లో ఆర్థిక, ఆర్థికేతర ఘటనలుగా వేర్వేరుగా విభజించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

రకరకాలుగా బెదిరింపులు..

రాత్రి సమయంలో గుర్తు తెలియని నంబర్ నుంచి వీడియో కాల్ వస్తుంది. ఎవరో అనుకుని కాల్ లిఫ్ట్ చేస్తే.. అవతలి వైపు ఒక నగ్నంగా ఉన్న వ్యక్తి.. ఫోన్‌లో స్క్రీన్ రికార్డింగ్ చేసుకుని ఆపై బెదిరింపులకు పాల్పడతారు. భయపడినా, అమాయకంగా కనిపించినా బెదిరింపులకు దిగుతారు. అందినకాడికి డబ్బులు వసూలు చేసేందుకు ఎంతకైనా తెగిస్తారు. అలాగే కొరియర్ పంపించి, అందులో వివాదాస్పద వస్తువులు ఉన్నాయని పోలీసు అధికారుల పేరుతో బెదిరింపులకు పాల్పడతారు. బ్యాంకు అధికారులమని చెప్పి వ్యక్తిగత వివరాలతోపాటు పాస్‌బుక్, ఆధార్, ఓటీపీ ఇతర వివరాలను సేకరిస్తున్నారు. ఇలా ఖాతాల్లోని సొమ్ము మాయం చేస్తున్నారు. సమయంలో అప్రమత్తంగా ఉంటే సమస్య నుంచి బయటపడొచ్చని అధికారులు సూచనలు చేస్తున్నారు.

- బ్యాంకు, పోలీసు, ఇతర అధికారులెవ్వరూ ఫోన్‌లో వివరాలు సేకరించరని గుర్తుంచుకోవాలి. ఎట్టి పరిస్థితిలోనూ వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు.
- కస్టమ్స్, ఏసీబీ, ఈడీ, సీబీఐ, పోలీసులు.. ఇలా ఏ దర్యాప్తు సంస్థ ఫోన్‌లో లేదా వీడియో ద్వారా విచారణ చేపట్టదు. ఇలాంటి వ్యక్తుల పేరుతో ఫోన్ కాల్ వచ్చిందంటే అనుమానించాల్సిందే. గుర్తు తెలియని నంబర్ల నుంచి కాల్స్ వస్తే స్పందించవద్దు. విసిగిస్తే నంబర్లను బ్లాక్ చేయడం ఉత్తమం.
- న్యూడ్ వీడియోకాల్స్‌కు భయపడాల్సిన అవసరం లేదు. వేధింపులకు గురిచేస్తే కుంగిపోవద్దు. పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించి ఫిర్యాదు చేయాలి. నగదు పోతే పోలీస్‌స్టేషన్ లేదా బ్యాంకులో ఫిర్యాదు చేస్తే ఆ నగదు ఇతర ఖాతాలకు బదిలీ కాకుండా నిలిపి వేసే అవకాశం ఉంటుంది. వేగంగా ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశాలు పెరుగుతాయి.

మట్టి వినాయకుడు.. పర్యావరణ పరిరక్షకుడు



రుద్రాపూర్‌లో తయారు చేసిన మట్టి విగ్రహాలు

చింతలమానెపల్లి: వినాయక చవితి ఉత్సవాలకు భక్తులు సిద్ధమవుతున్నారు. గణనాథుడి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే పనిలో కళాకారులు నిమగ్నమయ్యారు. గతంలో ఇళ్లలో ప్రతిష్టించే విగ్రహాలను కుమ్మరి కళాకారులు తయారు చేసే మట్టి విగ్రహాలకు కాల క్రమేణా ఆదరణ తగ్గింది. రంగులతో మురిపించే విగ్రహాలు పర్యావరణానికి హానికరంగా మారుతుండటం, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై స్పృహ పెరగడంతో మళ్లీ మట్టి విగ్రహాలకు ఆదరణ వస్తోంది. చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామంలో కుమ్మరి కళాకారులు మట్టి విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇళ్లలో ప్రతిష్టించేందుకు వీలుగా మంచిర్యాల, కాగజ్‌నగర్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు.

కూలి మాత్రమే గిట్టుబాటు



కుమ్మరి కళాకారులకు మట్టి పని మాత్రమే ఉపాధి. వినాయక విగ్రహాల తయారీకి సిర్పూర్(టి) మండలం లోనవెల్లి నుంచి మట్టి తీసుకొస్తాం. మట్టి విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. కానీ రోజుల తరబడి పని చేసినా కూలి మాత్రమే గిట్టుబాటవుతుంది. ఎక్కువగా ఆర్డర్లు వస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు మట్టి వినాయకుల వినియోగానికి ప్రచారం చేసి, కులవృత్తిగా ఉన్న విగ్రహాల తయారీని ప్రోత్సహించాలి.

– శంకర్, రుద్రాపూర్

- మరిన్ని కథనాలు 8లో▸

పల్లెల్లో పనుల జాతర

- ఈ నెల 22న ప్రారంభించేందుకు ఏర్పాట్లు



ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పల్లెల్లో పనుల జాతర కార్యక్రమం చేపట్టనుంది. ఈ నెల 22న పనుల జాతర – 2025 కార్యక్రమం చేపట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఏర్పాట్లు సిద్ధం చేశాయి. ఆ రోజున ఉపాధిహామీ పథకంతోపాటు వాటర్‌షెడ్ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, స్వచ్ఛ భారత్ వంటి విభాగాల్లో చేపట్టిన, చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు నిర్వహించనున్నారు.

జిల్లాలో 951 పనులు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పనుల జాతర –2025 నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి దత్తారావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 951 పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేయనున్నారు. ప్రారంభోత్సవాలకు స్థానిక ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. పనుల జాతరలో భాగంగా నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, ఇందిరా మహిళా శక్తి– ఉపాధి భరోసా కింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులైన పశువుల కొట్టం, కోళ్ల, గొర్రెల షెడ్లు, పండ్ల తోటలు, వానపాముల ఎరువుల తయారీ, అజోల్లా పిట్ నిర్మాణం, జల నిధి పథకం కింద వాన నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే ఫారం పాండ్స్, ఊట కుంటలు వంటి పనులు ప్రారంభించనున్నారు. రైతులు, లబ్ధిదారులను గుర్తించి గ్రామ సభల్లో మంజూరు ఉత్తర్వులు అందించనున్నారు. అలాగే ఉపాధిహామీ పథకంలో ఎక్కువ రోజులు పని చేసిన కూలీలతోపాటు దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికులు, హరిత సంరక్షకులను సన్మానిస్తామని అధికారులు వెల్లడించారు.

బీజేపీకి నాయకుల రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, సీనియర్ నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కోఆర్డినేటర్ వెంకటేశ్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కాగజ్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షుడు రవికాంత్‌తోపాటు సుమారు 500 మంది కార్యకర్తలు రాజీనామా చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో పార్టీలో త్వరలో చేరనున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

వరద నష్టాల నివారణకు చర్యలు

- వ్యవసాయశాఖ అధికారులు వెంటనే నివేదికలు రూపొందించాలి
- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు, వేదికపై కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జరిగిన వరద నష్టాల నివారణకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని తెలిపారు. రహదారులు, కల్వర్టులు, వంతెనలు, లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయాయన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 4,503 ఎకరాల పత్తి, వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లిందని, సుమారు 3,100 మంది రైతులు పంటలను నష్టపోయారని వెల్లడించారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం, రైతుల వివరాలు నమోదు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పశు సంపద నష్టం వివరాలతో నివేదికలు రూపొందిస్తే పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో రహదారులు కొంతమేర ధ్వంసమయ్యాయని, తెగిన అప్రోచ్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్సీ విఠల్ మాట్లాడుతూ సిర్పూర్(టి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడి విద్యార్థులను ఇతర గురుకులాలకు తరలించారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీశాఖ అడ్డుపడుతుందని ఆరోపించారు. అంతకు ముందు మంత్రి జిల్లా కేంద్రంలోని కుమురం భీం విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేశారు. ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొందికి చెందిన సిడాం గంగుకు చెందిన మేకలు వర్షాలతో మృత్యువాత పడగా, బాధితుడికి రూ.1.50 లక్షల పరిహారం ప్రొసీడింగ్ అందించారు. సమావేశంలో కాగజ్‌నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్, జీసీవో తిరుపతి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, రోడ్లు భవనాల శాఖ ఈఈ సురేశ్, డీఏవో శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: వరదలతో దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఆసిఫాబాద్ మండలం రాజురకు వెళ్లే రహదారిపై కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించారు. రాజుర గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని, బూర్గుడ నుంచి రాజుర వరకు రోడ్డు వేయాలని, పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంట నష్టం, రహదారులు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించి మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. తక్షణ సాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

రైతులను ఆదుకోవాలి

వట్టివాగు ప్రాజెక్టు కాలువకు గండి పడటంతో రైతులు పత్తి పంట నష్టపోయారని బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. జిల్లాలో కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరందించాలన్నారు.

ఎన్టీఆర్ కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపుతాం

రెబ్బెన: ఎన్టీఆర్ కాలనీ వాసుల వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని వరద ప్రభావిత ప్రాంతమైన ఎన్టీఆర్ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠల్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ జెడ్పీటీసీ సోమయ్య, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

కుమురంభీం విగ్రహానికి నివాళి

కెరమెరి: మండల కేంద్రంలోని సాకడ చౌరస్తా వద్ద ఉన్న కుమురంభీం విగ్రహానికి మంత్రి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ, పూలే విగ్రహాలకు నివాళులర్పించారు.

ముంచెత్తిన 'వార్ధా'



వీర్దండిలో విలపిస్తున్న జాడే అనిల్

జిల్లాతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు వార్ధా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈక్రమంలో కౌటాల మండలం వీర్దండి గ్రామ శివారులోని పత్తి చేలల్లోకి వరద చేరి చెరువులను తలపిస్తున్నాయి. గ్రామానికి చెందిన జాడే అనిల్ నది ఒడ్డున ఐదెకరాల్లో పత్తి సాగు చేయగా, మూడు రోజులుగా మొక్కలు నీట మునిగి ఉన్నాయి. వరదలో మొక్కలు మురిగిపోతాయని, ప్రభుత్వం పరిహారం అందించాలని వేడుకుంటున్నాడు. కాగా, కౌటాల మండల వ్యాప్తంగా వరదలతో 1000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. - కౌటాల

కార్మికుడి వారసులకు చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడి వారసులకు బుధవారం ఏకమొత్తం చెక్కును గోలేటి లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అందజేశారు. గోలేటి 1ఏ గనిలో కోల్ కట్టర్‌గా పనిచేస్తూ అనారోగ్య కారణాలతో గులాం మృతి చెందాడు. అతని వారసులైన యూసుఫ్ అలీ, మాసుం అలీ వారసత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారు మెడికల్ ఫిట్ సాధించలేకపోవడంతో ఏకమొత్తం చెల్లింపు కోసం యాజమాన్యానికి దరఖాస్తు చేసుకోవడంతో ఆదాయపు పన్నును మినహాయింపు కాగా ఒక్కొక్కరికి రూ. 6.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైజీఎం రాజేశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకులు కిరణ్, జూనియర్ అసిస్టెంట్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం లకీ డ్రా ద్వారా విద్యార్థిని ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ అధికారి సజీవన్‌తో కలిసి లక్కీ డ్రా నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని హారిణిని ఎంపిక చేశామని ఆయన తెలిపారు.



లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

విగ్రహాల తయారీలో నిమగ్నం



మట్టితో తయారు చేస్తున్న వినాయకుడు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి సమీపిస్తుండడంతో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. పట్టణంలోని పెట్రోల్‌పంప్ ఏరియా, మార్కెట్, మండలంలోని నజ్రుల్‌నగర్, రాంనగర్, విలేజ్‌నెం 5, చింతగూడ గ్రామాల్లో మట్టి వినాయకుల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి



చిన్ననాటి నుంచే విగ్రహాల తయారీపై ఆసక్తితో చిన్నచిన్న గణపతులను తయారు చేసి ఇంట్లో పూజించేవాళ్ళం. 23 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నా. భక్తులను ఆకర్షించేలా వివిధ డిజైన్లలో, హనుమంతుడిపై వినాయకుడు, రామ సేతు వినాయకుడులాంటి రూపాల్లో బంకమట్టి, సహజ సిద్ధమైన రంగులతో 5 నుంచి 20 ఫీట్ల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నా. ఈ ఏడాది ఇందిరా మార్కెట్ భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నా.

– గొల్లె విక్రమ్, కళాకారుడు, కాగజ్‌నగర్

పర్యావరణ పరిరక్షణకు..



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను తయారు చేస్తున్నా. వినాయకుడి విగ్రహాలతో పాటు దుర్గాదేవి విగ్రహాలను కూడా తయారు చేస్తా. పదోతరగతి తర్వాత మట్టి విగ్రహాలను ఇంట్లో తయారు చేసేవాడిని. ఇప్పుడు 12 ఫీట్ల వరకు వినాయ విగ్రహాలను తయారు చేస్తున్నా. పట్టణంలోని త్రినేత్ర శివాలయంలో వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠిస్తాం

– ములుకుట్ల జశ్వంత్, ఆదర్శనగర్, కళాకారుడు

పర్యావరణహితాయ..
పార్వతి తనయా

- మట్టి వినాయకులకు పెరుగుతున్న ప్రాధాన్యత
- విభిన్న ఆకృతుల్లో దర్శనమిస్తున్న లంబోదరుడు
- ఉపాధి పొందుతున్న పలువురు కళాకారులు

ఆదిలాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రం వ్యాప్తంగా మట్టి ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. ఎంతోమంది కళాకారులకు ఉపాధి అందిస్తున్నాయి. వైవిధ్యమైన రూపాల్లో పార్వతి తనయున్ని పర్యావరణహితంగా ప్రతిష్ఠించేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక ప్రతిమలను నిలబెట్టేందుకు యువత, ఉత్సవ సమితి సభ్యులు ప్రాధాన్యత నిస్తుండడం విశేషం. పీఓపీ విగ్రహాలు తక్కువ సమయంలో పూర్తవుతాయి. మట్టి ప్రతిమల తయారీకి 10 నుంచి 20 రోజులు పడుతుంది. అయినప్పటికీ నిర్వాహకులు వైవిధ్యమైన రూపాల్లో మట్టి వినాయకున్ని కొలువుదీర్చేందుకు ఆర్డర్లు ఇస్తుండడం గమనార్హం. దీంతో కళాకారులకు చేతినిండా పని దొరుకుతోంది. మరోవైపు పర్యావరణ పరిరక్షణ సైతం సాధ్యమవుతుండడంతో పర్యావరణ ప్రేమికుల నుంచి సైతం హర్షం వ్యక్తం అవుతుంది.



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

ఆదరణ పెరిగింది



గతంతో పోలిస్తే పీఓపీ విగ్రహాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వైవిధ్యమైన ప్రతిమలు తయారు చేయాలంటే మట్టితో మాత్రమే సాధ్యమవుతుంది. దీంతో మట్టి వినాయక విగ్రహాలకు ఆదరణ పెరిగింది. మట్టి ప్రతిమలు తయారు చేసేందుకు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. ముందుగానే ఆర్డర్ ఇస్తే మరిన్ని ప్రతిమలు తయారు చేసే అవకాశం ఉంటుంది.

– ఎగిడి రవి కుమార్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

నల్లమట్టి దొరకడం లేదు..



పది సంవత్సరాల వయస్సు నుంచే విగ్రహాల తయారీలో పాల్గొంటున్నా. నేను ఉద్యోగం చేస్తూనే.. మా కులవృత్తిని కాపాడుకునేందుకు విగ్రహ తయారీని కొనసాగిస్తున్నా. గతంలో స్థానికంగానే దొరికే నల్లమట్టితో విగ్రహాలను తీర్చిదిద్దే వాళ్ళం. అయితే ఇప్పుడు నల్ల మట్టి కరువైపోయింది. స్థానికంగా దొరకడం లేదు. దీంతో మహారాష్ట్రలోని అమరావతి నుంచి మట్టిని కొనుగోలు చేస్తున్నాం. – ప్రశాంత్ కుమార్, విగ్రహ కళాకారుడు

వారసత్వం కొనసాగిస్తున్నాం..



సంప్రదాయ బద్ధంగా తాతలు నేర్పిన కళను ముందుకు తీసుకెళ్తున్నాం. సాధారణ రోజుల్లో ఉద్యోగాలు చేసుకుంటూ, ప్రత్యేక పర్వదినాల సమయంలో విగ్రహాల తయారీ చేపడుతున్నాం. నిర్మల్ ప్రాంతంలో మావారు కొయ్య బొమ్మలు తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో మేము ఎక్కువగా వినాయకచవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాల సమయంలో, బోనాల సమయంలో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– చంద్రశేఖర్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

కళాకారులను ఆదుకోవాలి



సీజన్ సమయంలో మాత్రమే ఉపాధి దొరుకుతుంది. దీంతో మాలాంటి కళాకారులంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి కళాకారులపై దృష్టి సారించాలి. ప్రోత్సాహకాలను అందించడంతోపాటు, ఏవైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అండగా నిలబడాలి. ప్రస్తుతం నేను 54 అడుగుల విగ్రహాన్ని తయారు చేస్తున్నా. విగ్రహాల ఎత్తు పెరుగుతుంది తప్పితే మా జీవితాల్లో మాత్రం ఎదుగుదల కనిపించడం లేదు.

– ఊరే గణేశ్, విగ్రహ కళాకారుడు

నిర్మల్‌లో పదేళ్లుగా...



మట్టి వినాయకుడి తయారీలో కళాకారుడు గోపి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణం గతం నుంచీ మట్టి గణపతుల తయారీకి ప్రసిద్ధి గాంచింది. జిల్లా కేంద్రానికి చెందిన కోటగిరి గోపి పదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. అతని కుమార్తె మంజుశ్రీ తయారైన మట్టి విగ్రహాలకు డిజైనింగ్ చేస్తుంది. కుమారుడు గణిత్ వారికి సహాయపడుతుంటాడు. సుమారు 30 విగ్రహాలను తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తుంటారు. ఇవి మూడు ఫీట్ల నుంచి ఏడు ఫీట్ల వరకు ఉంటాయి. మట్టి గణపతుల తయారీలో చెరువుల నుంచి తెచ్చిన బంకమట్టి, ఎండిన వరిగడ్డి, తవుడు, ఊబక, కట్టెపొడి, వెదురు బొంగులు వాడుతున్నారు. ఇవన్నీ పర్యావరణహితమని చెబుతున్నారు. వీటిని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఇవన్నీ తేలికగా నీటిలో కరిగిపోతాయి. డిజైన్, సైజ్ ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు ఉన్నాయి.

వినాయకుడు అంటేనే ప్రకృతి..



హిందూ సంప్రదాయం ప్రకారం మట్టి గణపతినే పూజించాలి. గణపతి పూజ అంటే ప్రకృతికి పూజ అని అర్థం. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ అఫ్ పారిస్ గణపతులతో వాతావరణం కలుషితం అవుతుంది. కాబట్టి మన ధర్మాన్ని మనం పాటించాలి.

– కోటగిరి గోపి, విగ్రహ కళాకారుడు, నిర్మల్

మట్టి మేలు తలపెట్టి..!

మంచిర్యాలఅర్బన్: సంప్రదాయంగా వస్తున్న పండుగలను ప్రస్తుతం జరుపుకునే విధానంలో చేస్తున్న పొరపాట్లు పర్యావరణానికి ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి. వినాయక చవితి రోజు చేస్తున్న పొరపాట్లు చీకట్లు మిగుల్చుతున్నాయి. కానీ.. వినాయక చవితి అనగానే ఆకర్షణ, హంగు, ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొన్నేళ్లుగా రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాలతో భక్తులను ఆకట్టుకునే విధంగా మట్టి గణపయ్యలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కులవృత్తులు కాపాడుతూ.. ఉపాధినిస్తూ

కనుమరుగవుతున్న కులవృత్తిని కాపాడాలనే సదుద్దేశంతో మట్టి వినాయకుల తయారీతో పాటు ఎంతోమందికి ఉపాధినిస్తున్నారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన నాగపూరి రాజేంద్రప్రసాద్ మంచిర్యాలలోని సున్నబట్టివాడలో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసిన ఆయన కులవృత్తితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఆలోచన చేశారు. 2015లో ఏడు మట్టి విగ్రహాలు తయారీ చేసి విక్రయించారు. 2018లో 52 మట్టి ప్రతిమలను రూపొందించి పర్యావరణ హితానికి నడుం బిగించారు. ప్రస్తుతం శ్రీగణేష్ క్లే వర్క్ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. దాదాపు 80 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు.



మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు

మున్ముందు దీపావళికి ఉపయోగించే ప్రతిమలు, ఇంట్లో వినియోగించే మట్టిపాత్రలు, కుండలు ఇలా అన్ని రకాలు తయారీ చేయాలని నిర్ణయించారు.

మట్టివిగ్రహాలతో ఆదాయం భళా..

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీ సరఫరా టెండర్ దక్కించుకున్నారు. 40వేల వినాయకులు సరఫరా చేయనున్నారు. మరోవైపు రెండో అన్నవరంగా పేరొందిన గూడేం సత్యనారాయణ టెంపుల్‌లో ఏర్పాటు చేసే మట్టి వినాయకుడు ఇక్కడే తయారు చేశారు. ఆదిలాబాద్ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 2వేల మట్టి వినాయకుడు ఆర్డర్ ఇచ్చింది. ఎనిమిది నుంచి తొమ్మిది అడుగుల ఎత్తులో మట్టి వినాయకులు తయారు చేశారు. వినాయకుల తయారీలో కర్ర, మట్టి, గడ్డితో తడి సున్నం, వాటర్ కలర్‌లు విని యోగించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రభుత్వం పర్యావరణంతోపాటు కులవృత్తులను ప్రోత్సహించటానికి ప్రభుత్వ స్థలం లీజుకు ఇస్తే మరింత మందికి ఉపాధినిస్తానని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

తాతల కాలం నుంచి..

తాతల నుంచి వచ్చిన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని మట్టి వినాయకులు తయారీ చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు మంచిర్యాలకు చెందిన తాళ్లపల్లి తిరుపతి. ఇంటర్ పూర్తి చేసినా కులవృత్తి మట్టికుండల తయారీలో తర్ఫీదు పొందాడు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికుల సహకారంతో ఏటా 2వేల విగ్రహాలకు పైన మట్టి విగ్రహాలు తయారు చేసి ఆర్డర్‌పై ఇస్తుంటాడు. మూడు కుటుంబాలు మట్టి వినాయకుల తయారీలో పాలు పంచుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. చిన్న విగ్రహాలను చూడముచ్చటగా తీర్చిదిద్ది మార్కెట్లో విక్రయిస్తుంటా రు. మట్టికి సులువుగా కరిగే గుణం ఉంటుంద ని, విగ్రహాల తయారీలో చెరువు మట్టి వినయోగంతో పూడిక సమస్య తొలగిపోతందుని అందు కే మట్టికి ప్రాధాన్యం ఇస్తున్నామని తిరుపతి తెలి పారు. వినాయక చవితి పర్యావరణానికి పూర్తిగా మేలు చేసే పండుగని, మట్టితో పూజించాలని సూచించారు.



తిరుపతి తయారు చేసిన మట్టి విగ్రహాలు

పదిహేనేళ్లుగా తయారీ



చెన్నూర్: పర్యావరణ పరిరక్షణేలక్ష్యంగా పది హేనేళ్లుగా మట్టి విగ్రహాలు త యారు చేస్తున్నా. ప్రతియేటా వంద మట్టి విగ్రహాలు త యారు చేస్తుంటా. మట్టిని తీసుకొచ్చి స్వయంగా నెల రోజుల వరకు విగ్రహాలను తయారు చేస్తా. మట్టి ఖర్చులు తీసుకొని విగ్రహాలు ఇస్తాను. కొన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నా. ఇప్పటి వరకు మూడు ఫీట్ల ఎత్తు విగ్రహాలు చేస్తున్నా. రానున్న రోజుల్లో పది ఫీట్ల ఎత్తు విగ్రహాలు తయారు చేస్తాను.

క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు దూడలు



కవల దూడలతో తల్లిగేదె

నిర్మల్‌ఖిల్లా: సర్వసాధారణంగా గేదెకు ఒకే దూడ జన్మించడం చూస్తుంటాం.. కానీ నిర్మల్ జిల్లా కేంద్రంలో మాత్రం గేదెకు ఒకే కాన్పులో రెండు దూడలు జన్మించిన అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసముండే గిరిగంటి అనిల్ పశుపోషణ ద్వారా పాల కేంద్రం నిర్వహిస్తుంటాడు. ఇతని వద్ద ఉన్న గేదె బుధవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం అరుదని, వందల్లో ఒకటిరెండు శాతం మాత్రమే ఇలా జరుగుతాయని పశువైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ట్విన్ ప్రెగ్నెన్సీ రావడానికి ప్రధానంగా హార్మోన్ల సంతులనం, గేదెకు మంచి పోషకాలతో కూడిన దాణ అందించడం కారణాలని అభిప్రాయపడుతున్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గాదె రాజేశ్ (28) బుధవారం మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాత్త్విక‘ముని’కి కీర్తి పురస్కారం



రాజారావు

నిర్మల్‌ఖిల్లా: ప్రముఖ తాత్త్విక కవి, రచయిత మునిమడుగుల రాజారావుకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది. ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలను అందిస్తోంది. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం పురస్కార వివరాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలం తంగళ్ళపల్లికి చెందిన రాజారావు యుక్తవయసునుంచే సాహిత్య పఠనం తాత్త్విక రచనల ద్వారా విశేషంగా పేరు గడించారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. అనాగరిక గేయం, నేను ఎవరు..?, దుఃఖ నది, హూ ఎమ్ ఐ, సత్యం వైపు పయనం వంటి అనేక రచనలతో సాహితీ రంగంలో తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. పలు రచనలు ఆంగ్లంలోనికి అనువాదమయ్యాయి. గతంలోనూ తన రచనల ద్వారా అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందుకోనున్నారు.

‘కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలు’



మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

ఇచ్చోడ: కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలని బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ నిషాని రాంచంద్రం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కమిటీల పనితీరు, పార్టీ బలోపేతం విధివిధానాలను సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 1950 నుంచి 93 వరకు బీసీలకు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల సతీశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, స్టేట్ ఈసీ మెంబర్ మెస్రం జంగుబాబు, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షులు జగన్, ముల్కల రాజేంద్రప్రసాద్, రత్నపురం రమేశ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు



దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, ఇటిక్యాల్ తాండ, పెంబి తాండ, తాటిగూడ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ గంగారెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభిషేకర్ తెలిపారు. వారి వద్ద నుండి 20 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, సాయి, రాజేందర్, రవీందర్, నిరోషా, రవి, అశ్వక్, జమీర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ ఎదుట ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన షేక్ మసూద్, మహారాష్ట్రలోని బోకర్ తాలుకా చిక్కల్‌వాడికి చెందిన జుబేర్ ఫారుక్ పఠాన్ గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్, సిబ్బంది సుధాకర్ రెడ్డి, వినాయక్, గోపాల్, నరేందర్, సంజీవ్, క్రాంతి అనుమానం వచ్చి వారిని విచారించారు. వారి వద్ద 243 గ్రాము ల ఎండు గంజాయి లభ్యం కావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నలుగురు పాత నేరస్తులను బుధవారం తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేసినట్లు టూటౌన్ ఎస్సై సీహెచ్ కిరణ్ కుమార్ తెలిపారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీకి యత్నించిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పరిధిలో గల శ్రీనివాస వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు వైన్స్ వెనుక గల గోడకు కన్నం వేసి లోనికి ప్రవేశించేందుకు యత్నించారు. అదే సమయంలో అటుగా వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరారయ్యారు. పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన షేక్ బిలాల్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్ షారుక్ ఖాన్‌లను పంజాబ్ చౌక్‌లో మంగళవారం పట్టుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

భుజంపై వాగు దాటించి..



కెరమెరి మండలంలోని బోరిలాల్‌గూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పవార్ కవిత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్లామంటే ఇటీవల కురుస్తున్న వర్షాలకు మధ్యలో ఉన్న అనార్‌పల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఇంటివద్దే ఉంటోంది. బుధవారం జ్వర తీవ్రత పెరగడంతో సొమ్మసిల్లి పడిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఆమెను భుజంపై ఎక్కించుకుని అతికష్టం మీద వాగు దాటించారు. కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - కెరమెరి

ప్రకృతి ఒడిలో పాలధార

సొనాల మండలంలోని ఘన్‌పూర్ జలపాతం పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. వర్షాకాలపు కొత్తదనాన్ని నింపుకుని తన సమ్మోహన అందాలతో చూపులను కట్టిపడేస్తోంది. మహారాష్ట్ర సరిహద్దులో ఘన్‌పూర్ గ్రామానికి కిలోమీటరు దూరంలోనే పచ్చని ప్రకృతి ఒడిలో ఈ అద్భుత దృశ్యం దాగి ఉంది. పైనుంచి కిందకు జాలువారుతున్న జలధార చూపరులకు కనువిందు చేస్తోంది.

- బోథ్



బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఒకరి రిమాండ్

నేరడిగొండ: ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్న శేఖర్ అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం బాధితురాలు ఖానాపూర్ వద్ద గల గంగానదికి వెళ్ళిన సమయంలో సమీప బంధువైన శేఖర్ తన సెల్‌ఫోన్లో వీడియోలు తీశాడు. ఇటీవల వాటిని ఆమె భర్త స్నేహితుడికి వాట్సాప్‌లో పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.